పదండీ.. లక్ష్యం దిశగా..

- 'పది'లో నూరు శాతం ఉత్తీర్ణతకు కార్యాచరణ
- విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ
- గ్రేడ్లుగా విభజించి బోధన

కొత్తపేట: భవిష్యత్తుకు తొలి మెట్టు పదో తరగతి. ఉన్నత విద్యకు గట్టి పునాది ఇది. ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇప్పటికే ప్రభుత్వం టైమ్ టేబుల్ ప్రకటించింది. కొత్తపేట నియోజకవర్గంలో 37 పాఠశాలలు ఉండగా 2,511 మంది పదో తరగతి చదువుతున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 45కు 2,426 మంది, రాజోలు నియోజకవర్గంలో 33కు 1,773 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. 10వ తరగతి విద్యార్థులకు గత జనవరికి సిలబస్ పూర్తి చేశారు. నవంబర్ నుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు మంచి గ్రేడ్‌లు పొందేందుకు మెలకువలు నేర్పుతున్నారు. రోజూ పరీక్షలు నిర్వహించి వారి సామర్థ్యాన్ని పరీక్షిస్తున్నారు. దాని ఆధారంగా గ్రేడులుగా విభజించి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. 550 పైబడి మార్కులు సాధించే లక్ష్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు తగు రీతిలో బోధిస్తూ రోజూ రివిజన్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. గతంలో ఎక్కువగా గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులలో ఉత్తీర్ణత తగ్గడంతో ఉపాధ్యాయులు వాటిపై ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నారు.

మార్పులకు అనుగుణంగా..

ఈ విద్యా సంవత్సరం కొన్ని మార్పులతో పరీక్షా విధానాన్ని ప్రభుత్వం ముందుగానే ప్రకటించి ఆ మేరకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేసింది. గతంలో ఏడు రోజులు జరిగే పరీక్షలను ఈ సంవత్సరం ఆరు రోజులకు కుదించింది.



కొత్తపాలెం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

సైన్స్ పరీక్షకు సంబంధించి భౌతికశాస్త్రం, జీవశాస్త్రాలకు వేర్వేరుగా ఆన్సర్ బుక్‌లను ఇస్తారు. మొదటి గంటన్నర పీఎస్, రెండో గంటన్నర బీఎస్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈ నూతన విధానంతో విద్యార్థులకు ఒకరోజు కలసి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ ఆలోచించి, ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు రోజు విడిచి రోజు పరీక్ష నిర్వహించే ఏర్పాట్లు చేసింది.

'జగనన్న విద్యాభారతి'తో మేలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం మేరకు పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ ఆధ్వర్యంలో 'జగనన్న విద్యాభారతి' పేరుతో స్టడీ మెటీరియల్ సరఫరా చేశారు. వీటిని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వేల మంది విద్యార్థులకు పాఠశాలల వారీగా పంపిణీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 22 మండలాల్లో 230 ప్రభుత్వ పాఠశాలలో 14,129 మంది విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ అందజేశారు. దీనివల్ల సీ, డీ గ్రేడ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు.



'జగనన్న విద్యాభారతి' స్టడీ మెటీరియల్

ఇష్టంగా చదవాలి



ఇష్టంగా చదివితే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధ్యమే. ప్రతి విద్యార్థిని మెరికల్లా తయారు చేసేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేస్తున్నారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా జెడ్పీ ఆధ్వర్యంలో సరఫరా చేసిన 'జగనన్న విద్యాభారతి' స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

- ఆదివారపుపేట వెంకటేశ్వరరావు, గణిత ఉపాధ్యాయుడు, జెడ్పీ ఉన్నత పాఠశాల, కొత్తపాలెం

సూచనలు పాటిస్తూ..



నేను ప్రశాంత వాతావరణంలో ఏకాగ్రతగా చదువుతున్నా. దానితో పాఠ్యాంశాలు గుర్తుంటున్నాయి. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తున్నాను. ముఖ్యమైన పాఠ్యాంశాల్లో సందేహాలను నివృత్తి చేసుకుంటున్నా. వచ్చే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించగలననే నమ్మకం ఉంది.

- రాయుడు అంజలీ నాగదుర్గ, విద్యార్థిని, కొత్తపాలెం

సాగునీటి సమస్య పరిష్కారానికి వినతి

మామిడికుదురు: నగరం గ్రామంలోని పంట పొలాలకు సక్రమంగా సాగునీరు అందించాలంటూ స్థానిక రైతులు బుధవారం తాటిపాక ఇరిగేషన్ ఏఈ సుందర్‌సింగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. తాటికాయల ఉదయభాస్కరరావు, బొంతు భాస్కరరావు, రాయుడు ఆనందరావు తదితరులు ఏఈని కలసి సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏటా దాళ్వా పంటకు ఇదే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. దీనిపై పరిశీలన చేసి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటానని ఏఈ సుందర్‌సింగ్ హామీ ఇచ్చారని రైతులు పేర్కొన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయండి



సీ క్లాస్ పట్టా భూములను పరిశీలిస్తున్న జేసీ ధ్యానచంద్ర

పి.గన్నవరం: సీ క్లాస్ లంక భూములను త్వరితగతిన సర్వే చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిరుపేదలకు ఐదేళ్ల కాలానికి లీజుకు ఇచ్చే చర్యలను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్‌తో కలసి నాగుల్లంక, పి.గన్నవరం, బెల్లంపూడి, ఊడిమూడిలంక, జి.పెదపూడి లంకల్లో సీ క్లాస్ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సీ క్లాస్ లంకలను ఏడాదికి మాత్రమే లీజుకు ఇచ్చేవారని, ఇప్పుడు లీజు పరిమితిని ఐదేళ్ల కాలానికి పెంచినట్టు వివరించారు. అనంతరం నాగుల్లంక జెడ్పీ ఉన్నత పాఠశాల నిర్మాణానికి ప్రతిపాదించిన 46 సెంట్ల భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేలం ద్వారా రూ.1.39 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: ర్యాలిలోని ఉమాకమండలేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన ఐదు షాపులకు వేలం పాటల నిర్వహణ ద్వారా రూ.1.39 లక్షల ఆదాయం లభించింది. గుంటూరుకు చెందిన దాత దేచిరాజు సత్యనారాయణమూర్తి తన సొంత నిధులను వెచ్చించి ఈ షాపులను నిర్మించారు. వీటికి బుధవారం జెడ్పీటీసీ బోణం సాయిబాబా, అవుట్‌సోర్స్ ఎంప్లాయీస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్ సమక్షంలో వేలం పాటలు నిర్వహించారు. దీని ద్వారా నెలసరి అద్దెలుగా రూ.11,600, ఏడాదికి రూ.1,39,200 లభిస్తున్నట్లు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. అనంతరం దాత సత్యనారాయణమూర్తిని అధికారులు సత్కరించారు.

రక్తదాతలకు అభినందన



రక్తదానం చేస్తున్న సభ్యులు

అయినవిల్లి: ఆపదలో ఉన్న మహిళలకు పలువురు రక్తదానం చేసి స్ఫూర్తిగా నిలిచారు. అయినవిల్లికి చెందిన సవిత సరోజినీకి రక్తం తక్కువ కావడంతో అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. రక్తం కోసం ఆమె కుటుంబ సభ్యులు స్వామి వివేకానంద యోగా ఆశ్రమాన్ని ఆశ్రయించారు. అలాగే ఓడలరేవుకు చెందిన చెందిన ఎం.దుర్గాదేవి కూడా ఈ సంస్థను ఆశ్రయించారు. దీంతో స్వామి వివేకానంద యోగా ఆశ్రమం, హనుమాన్ వ్యాయామ కళాశాల, ఆయుర్వేదం ఫిజియోథెరపీ ఆసుపత్రి సభ్యులు పి.గోవిందరాజు, ఎల్.నికిత్, ఎం.ప్రసాద్, ఎం.సుధీర్ పి.చంటిలు రక్తదానం చేశారు. వీరిని సంస్థ నిర్వాహకుడు శ్రీనివాస్ అభినందించారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రోజారమణి



గుబ్బల రోజారమణి

రాజోలు: రాజోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా తాటిపాక గ్రామానికి చెందిన గుబ్బల రోజారమణి నియమితులయ్యారు. తాటిపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఈ నెల 7న నోటిఫికేషన్ విడుదల చేసింది. వైఎస్సార్ సీపీ నాయకుడు గుబ్బల మనోహర్ సతీమణి రోజారమణి ఏఎంసీ చైర్‌పర్సన్ పదవి పొందడంపై బుధవారం పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్‌గా సుంకర వెంకట సత్యప్రసాద్, సభ్యులుగా కడలి లక్ష్మి, బొమ్మిడి దుర్గాభవానీ, లిఖితపూడి రాధారాణి, ఆచంట వీరవెంకట సత్యనారాయణ, బండి నూకరత్నం, మహ్మద్ ఫాతీమున్నీషా బీబీ, గుండుమేను నాగలక్ష్మి, తిరుమాని దుర్గ, బుంగ విజయ్‌మోహన్, నడింపల్లి శ్రీరామచంద్రరాజు, ముప్పర్తి విక్రమార్కరావు, చెవ్వాకుల రమేష్ బాబు, కంచర్ల కాశీ విశ్వనాథం, పొన్నమండ పీఏసీఎస్ అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, తాటిపాక సర్పంచ్ కోటిపల్లి రత్నమాల నియమితులయ్యారు.


బాధితులకు ఆపన్నహస్తం



బాధితులకు సామగ్రి అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు

ఆలమూరు: మడికిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆపన్నహస్తం అందించింది. ఐఆర్‌సీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ నారాయణ ఆధ్వర్యంలో ఎం.ప్రసాద్, ఎం.శేఖర్ తదితర ప్రతినిధుల బృందం బుధవారం గ్రామానికి చేరుకుని బాధితులైన గల్ల నాగవరలక్ష్మి, దేవరపూడి సత్యవతి కుటుంబాలను పరామర్శించారు. అనంతరం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ యు.లక్ష్మీ మౌనిక చేతుల మీదుగా రెడ్‌క్రాస్ సంస్థ తరఫున నిత్యావసర సరకులు, వంట పాత్రలు, టెంట్‌లు, నూతన వస్త్రాలను అందజేశారు. ఉండ్రాసపు సుందరం విజయం, పడమట రాంబాబు, దొండపాటి చంటి, అడబాల వీర్రాజు, మోటూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రం గీసి.. నివాళి అర్పించి



వాణీ జయరామ్, విశ్వనాథ్‌ల చిత్రాన్ని చూపుతున్న సంగీత్

మలికిపురం: ఇటీవల మృతి చెందిన సినీ దర్శకుడు కె.విశ్వనాథ్, గాయని వాణీ జయరామ్‌ల చిత్రాలను తన కుంచెతో మలికిపురం సునయన ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ నల్లి సంగీత్ గీశారు. వారికి నివాళులర్పించారు. తన అకాడమీలో ఆ చిత్రాన్ని ప్రదర్శించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి



జొన్నాడలో ఆలయ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: ఆధ్యాత్మికతను పెంపొందిస్తూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. జొన్నాడలో వేంచేసి ఉన్న శ్రీదేవి సమేత జనార్దన స్వామి, ఉమా సమేత మల్లేశ్వరస్వామి ఆలయాలకు నియమించిన ఆలయ కమిటీల ప్రమాణ స్వీకారం మంగళవారం రాత్రి జరిగింది. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్దనస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా తాడి రామచంద్రారెడ్డి (చిన్న రాము), మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ద్వారంపూడి వెంకటరెడ్డి (గురుస్వామి)తో పాటు నియమించిన మరో 12 మంది సభ్యులతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సుబ్రహ్మణ్యం ప్రమాణ స్వీకారం చేయించారు. దేవదాయశాఖ అధికారులు ఎంఎస్ఆర్ కృష్ణ, పీవీవీ సత్యనారాయణమూర్తి, అర్చకులు పాల్గొన్నారు.

పశు వైద్యాధికారికి సత్కారం

జొన్నాడలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా పెనికేరు పశు వైద్యాధికారి జి.భానుప్రసాద్‌కు ఘన సత్కారం జరిగింది. ఇటీవల గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లో రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఉత్తమ పశు వైద్యాధికారిగా భానుప్రసాద్ అవార్డు స్వీకరించారు. ఇందులో భాగంగా గతంలో జొన్నాడలో పశు వైద్యాధికారిగా పనిచేసినందుకు గాను అవార్డు వరించినందున జొన్నాడ ప్రజాప్రతినిధులు వైద్యాధికారి భానుప్రసాద్‌కు ఈ సత్కారం చేశారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- మాచవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



మాచవరంలో లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వచ్చాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం మాచవరం సచివాలయం-1లో ఐదో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరిస్తూ.. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను చిట్టిబాబు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలను తీసుకు వచ్చిందన్నారు. పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియాన్ని తీసుకువచ్చి పేదల విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. ప్రతి ఇంట్లో ఒకటి నుంచి మూడు వరకూ సంక్షేమ పథకాలు అందుతున్నట్లు లబ్ధిదారులే తెలియజేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తమ కుటుంబాల్లో వెలుగులు వచ్చాయని వివరిస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ప్రతి గడపకూ పథకాలు చేరుతున్నాయన్నారు. కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు ప్రజలంతా అండగా నిలవాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు, కొర్లపాటి కోటబాబు, సూదా బత్తుల రాము, అప్పన శ్రీనుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, దొమ్మేటి సత్యమోహన్, నేతల నాగరాజు, బొంతు శ్రీనివాస్, కోట సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిట్టిబాబు పరామర్శ

మామిడికుదురు: సతీ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలసిల రఘురామ్‌ను ఎమ్మెల్యే చిట్టిబాబు పరామర్శించారు. విజయవాడ గొల్లపూడిలోని రఘురామ్‌ను పరామర్శించి సానుభూతి తెలిపారు. రఘురామ్ భార్య స్వర్ణకుమారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్ కూడా ఆయన్ని పరామర్శించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లిబాబు

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. తొలుత ఆయా శాఖల వారీగా అభివృద్ధి పనులపై ఎంపీడీవో జి.భీమారావు సమీక్ష చేశారు. అనంతరం 2023-24 వార్షిక అంచనా బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. కాగా అంతర్వేది తీర్థ మహోత్సవాలకు సంబంధించి కల్యాణానికి దేవస్థానం తగిన పాస్‌లు ఇవ్వకపోవడం పట్ల పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు నిరసన తెలిపారు. ఎంఈవో కేపీసీ హెచ్‌వీ ప్రసాదరాజు ఆకస్మిక మృతికి సమావేశం సంతాపం తెలిపింది. వైస్ ఎంపీపీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చినరాజా, సఖినేటిపల్లి సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, ఈవోపీఆర్డీ కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హజరత్ అలీ గంధోత్సవం



గంధోత్సవంలో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం, మొట్టమొదటి ఇమామ్ హజరత్ అలీ గంధోత్సవాన్ని మామిడికుదురు, నగరం గ్రామాల్లో ముస్లింలు బుధవారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ఇందులో భాగంగా మామిడికుదురు బార్గాహే ఖమ్రే బనీ హాసిమ్ పంజా నుంచి గంధాన్ని తీసి శిరస్సుపై పెట్టుకుని భాజాలతో ఊరేగిస్తూ నగరంలోని పంజేషా వరకూ తీసుకువెళ్లారు. ఇక్కడ ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచారు. కార్యక్రమంలో సయ్యద్ రూహి, హకీమ్ అబ్బాస్ అలీ, కిష్వర్ అబ్బాస్ ఖాజరానీ, మీర్జా ఖాదం హుస్సేన్, నన్నేషా హుస్సేన్, షరీఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



ముక్కామలలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష సర్వే రాళ్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేతో భూముల సమస్యలు పరిష్కారం అవుతాయని కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి అన్నారు. ముక్కామలలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో మంజూరైన సర్వే రాళ్లను బుధవారం పరిశీలించి సరిహద్దుల్లో వేయించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్ట్‌గా జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షను ఆలమూరు మండలం కల్వచర్లను ఎంపిక చేసుకుని భూహక్కు పత్రాలతో పాటు, సరిహద్దు రాళ్లను అందించామన్నారు. అంబాజీపేట మండలం ముక్కామలలో 228 ఖాతాలకు గాను 800, పసుపల్లిలో 381 ఖాతాలకు గాను 1685 సరిహద్దు రాళ్లను స్థలాల వారికి ఇచ్చామన్నారు. వక్కలంకలో సర్వే జరుగుతుందన్నారు. ఆలమూరు మండలం మడికిలో 3,180, బీవీ లంకలో 3,277, చింతలూరులో 1,560, పినికేరులో 1,764, నర్సిపూడిలో 2,394, చొప్పెల్లలో భూహక్కు పత్రాలతో పాటు సరిహద్దు రాళ్లను పంపిణీ చేశామన్నారు. రావులపాలెం మండలం కోమరాజులంక, ఈతకోట, వెదిరేశ్వరం, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, కొత్తపేట మండలం అవిడి, కండ్రిగ గ్రామాలు వివిధ దశల్లో సర్వేల్లో ఉన్నాయన్నారు. త్వరలో ఈ గ్రామాలకు రాళ్ల పంపిణీ చేస్తామన్నారు. భూ వివాదాల పరిష్కారానికి ఈ భూ సర్వే ఉపకరిస్తుందన్నారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు సకాలంలో రీసర్వేను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. భూ రీసర్వేకు రైతులు, భూ యజమానులు సహకరించి సరిహద్దులను చూసుకోవాలన్నారు.

సరిహద్దుల సక్రమంగా ఉంటే సంబంధిత యజమానులకు ల్యాండ్ పార్శిల్ నెంబర్ (ఎల్.పి.నెం)ను ఇస్తామని, రాళ్లు వేసుకోవాలన్నారు. ఆర్డీవోతో పాటు ఇన్‌చార్జి తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, పంచాయతీ కార్యదర్శి వి.తాతాజీ, వీఆర్వోలు, భూ సర్వేయర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభంగా గో వృషభ కల్యాణం



లూటుకుర్రులో గో వృషభ కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: లూటుకుర్రులో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో బుధవారం గో వృషభ కల్యాణం ఘనంగా జరిగింది. కోలా చినసత్తిబాబు, వీరారత్నం దంపతులు గోవుకు, ఎద్దుకు కల్యాణం జరిపించారు. సంప్రదాయబద్ధంగా వేద మంత్రాల నడుమ ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, పాశర్లపూడిలంక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ సభ్యురాలు చెరుకూరి పార్వతి, చెరుకూరి సత్తిబాబు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన



ఆలమూరులో స్పర్శపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం స్పర్శ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, పి.ఉమ నేతృత్వంలో వైద్యారోగ్య సిబ్బంది కుష్ఠువ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. శరీరంపై మచ్చలు ఏర్పడితే సత్వరమే సమీప ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ పక్షోత్సవాలు ఈ నెల 13 వరకూ జరుగుతాయని సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈఏ వీవీ రాజా తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాదరెడ్డి, ఆరోగ్య సిబ్బంది వి.సీతమ్మ, వరలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారి జన్మదిన వార్షికోత్సవాలు ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లో ఉన్న శ్రీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జన్మదిన వార్షికోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 16వ తేదీ వరకూ వార్షికోత్సవాలు జరుగుతాయని శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పూల దండలతో అలంకరించారు. తొలి రోజు అమ్మవారికి ఆవుపాలు, ఆవు పెరుగు, పంచామృతాలు, సుగంధ మూలికా ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారి సన్నిధిలో అష్ట గణపతి హోమం, తొలి మహా విద్యా శ్రీకాళీదేవి హోమం నిర్వహించారు.

రాష్ట్ర ఈత పోటీలకు ఎంపిక

తాళ్లరేవు: ఈ నెల 11 నుంచి 13 వరకూ కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఇదుపుగుళ్లలో జరిగే రాష్ట్రస్థాయి ఈత పోటీలకు పటవల హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ మాచరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 విభాగం నుంచి అరదాడి సత్తిరాజు, దున్నా రాజు, అండర్-14 విభాగం నుంచి ఓలేటి మహాలక్ష్మి ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అభినందించారు.

ఐదు సులభ్ కాంప్లెక్స్‌ల మంజూరు



ఎండీ సంపత్‌కుమార్‌ను కలసిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రాజోలు నియోజకవర్గానికి ఐదు సులభ్ కాంప్లెక్స్‌లు మంజూరైనట్లు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన అమరావతిలో స్వచ్ఛ భారత్ ఎండీ సంపత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సులభ్ కాంప్లెక్స్‌ల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి ఎండీ సంపత్ సానుకూలంగా స్పందించారు. మలికిపురంలో రెండు, రాజోలులో రెండు, తాటిపాకలో ఒకటి చొప్పున సులభ్ కాంప్లెక్స్‌లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

యానాం: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు బుధవారం ఇన్‌చార్జి ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. 22 రాయల్ స్టాగ్ ఫుల్‌బాటిల్స్‌ను బైక్‌పై నలుగురు వ్యక్తులు తరలిస్తుండగా యానాం బైపాస్ రహదారిలో హెడ్ కానిస్టేబుల్స్ కడలి శ్రీనివాస్, పెమ్మాడి కృపానందంలు నిందితులను పట్టుకున్నారని చెప్పారు. నిందితులను కేసు నమోదు నిమిత్తం యానాం ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించినట్లుగా వివరించారు.